క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయిజ: విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు చేపట్టిన మరమ్మతులో కారణంగా మండలంలోని ఉప్పల, ఉప్పల క్యాంపు గ్రామాలకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నీలి గోవిందు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజలోని 132 కేవీ సబ్ స్టేషన్ నుంచి ఉప్పల సబ్‌స్టేషన్‌కు వెళ్లే 33 కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయని, వాటిని తొలగించనున్న నేపథ్యంలో సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికితీయాలి



మానవపాడు: విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాన్ని వెలికితీయాలని ఎంఈఓ శివప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని అమరవాయి, మానవపాడు పాఠశాలలో తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



అలంపూర్: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టుకున్నట్లు ఉండవెల్లి ఎస్ఐ శేఖర్ తెలిపారు. అలంపూర్ చౌరస్తాలో కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, ఎండీ ఖాదర్‌బాష గురువారం తెల్లవారుజామున గస్తీ నిర్వహిస్తుండగా టీజీ 33టీ1448 నంబర్ గల టిప్పర్ లారీలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని ఉండవెల్లి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం దిన్నె గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలింపు

మానవపాడు: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చంద్రకాంత్ అన్నారు. గురువారం మానవపాడు స్టేజీ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లారీలను పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్లు సాయికుమార్, భానుప్రకాశ్, లారీ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతు



కేటీదొడ్డి: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని మైలగడ్డ సమీపంలో ర్యాలంపాడు కాల్వ వద్ద ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో గద్వాల సీఐ టంగుటూరి శ్రీనివాస్ ఆదేశానుసారం ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గురువారం ట్రాక్టర్ల ద్వారా మట్టి తోలించి గుంతలు పూడ్చివేశారు. ఈ సందర్భంగా వాహనదారులు, ప్రజలు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



ఇటిక్యాల: సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని వైద్యురాలు శరణ్య సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశాలు సీజనల్ వ్యాధులు టైఫాయిడ్, మలేరియా, డెంగీ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేయించుకునేలా ప్రోత్సహించాలన్నారు. అదే విధంగా పరిసరాల పరిశుభ్రత గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్లున్నా.. బస్సు రాదాయె

- ఆర్టీసీ సౌకర్యానికి నోచుకోని పల్లెలు
- అందని ద్రాక్షలా మహాలక్ష్మి పథకం
- ప్రైవేటు వాహనాలే దిక్కు



వేములలో విచ్చలవిడిగా ప్రజలను ఎక్కించుకున్న ప్రైవేటు వాహనదారుడు

ఎర్రవల్లి: రోడ్డు సౌకర్యం సక్రమంగా ఉన్నా గానీ పల్లెలకు ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పల్లె వాసులు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం అందని ద్రాక్షలా మారిందని ఆయా గ్రామాల మహిళలు ఆరోపిస్తున్నారు. ఏళ్ల తరబడి అరకొర సర్వీసులతో అవస్థలు పడుతున్నట్లు మండంలోని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి మండలంలో..

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో ఎర్రవలి చౌరస్తా, షేకుపల్లి మీదుగా సాసనూలు, దువాసిపల్లి, వీరాపురం, కారుపాకుల, పాతగార్లపాడు వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా పొగాకు కంపెనీ నుంచి మునగాల, ఇటిక్యాల మండల కేంద్రం, ఉదండాపురం, చాగాపురం, షాబాద్, సాతర్ల, వావిలాల వరకు ఆర్టీసీ బస్సు సకాలంలో లేకపోవడంతో వందల సంఖ్యలో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రైవేటు వాహనాల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు.

ప్రైవేటు వాహనాలే దిక్కు

ఉమ్మడి ఇటిక్యాల మండలంలో పలు గ్రామాలకు బస్సు సర్వీసులు లేని కారణంగా ప్రజలు నిత్యం ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. గతంలో గద్వాల డిపో నుంచి ఆయా రూట్లలో ఆర్టీసీ బస్సులు నిత్యం తిరిగేవి. కానీ కరోనా కారణంగా లాక్‌డౌన్ నుంచి కేవలం విద్యార్థుల కోసమే ఉదయం, సాయంత్రం ఒకసారి మాత్రమే తిరుగుతున్నాయి. ఆ వచ్చే ఒక పూట బస్సులో ఐనా పోదామనుకున్నా బస్సులో స్థలం విద్యార్థులకే సరిపోవడం లేదని తెలుపుతున్నారు. దీంతో చాలా వరకు ఆటోలు, బొలెరో వాహనాల్లోనే ప్రయాణాలు సాగిస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. అదే విధంగా ఉచిత బస్సు ఊసేలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాహనదారుల ఇష్టారాజ్యం

నిత్యం మండల కేంద్రంతో పాటు ఎర్రవల్లి చౌరస్తాకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనదారులు ఇష్టానుసారంగా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని తరలిస్తున్నారు. దీనికి తోడు అధిక చార్జీలను వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పల్లెలకు మెరుగైన ఆర్టీసీ సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కారుపాకులలో పరిమితికి మించి ఆటోలో ఎక్కిన ప్రయాణికులు

బస్సు సౌకర్యం కల్పించాలి



ఎర్రవల్లి కూడలి నుంచి షే కుపల్లి మీదుగా కారుపాకులకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలి. ప్రైవే టు వాహనదారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

– చిన్నవీరన్న, గార్లపాడు

ప్రమాదాలు జరుగుతున్నాయి



పల్లెలకు బస్సులను నడపాలని పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదు. దీంతో ద్విచక్రవాహనాలు, ఆ టోల్లో పరిమితికి మించి ప్రయాణాలను కొనసాగిస్తుండటంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి.

– బాబురెడ్డి, సాసనూలు

ఉన్నతాధికారులకు విన్నవించాం

మండలంలోని పలు రూట్లలో బస్సులు నడపాలని కోరుతూ ప్రజల నుంచి వినతులు అందుతున్నాయి. ప్రస్తుతం డిపోలో ఉన్న అన్ని బస్సులు వివిధ రూట్‌లలో తిరుగుతున్నాయి. ప్రయాణికుల సమస్య గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే బస్సులు ఏర్పాటు చేస్తాం.

– సునీత, డీఎం, గద్వాల

ఎమ్మెల్యే పరామర్శ



అలంపూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉండవెల్లికి చెందిన ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌ను గురువారం కర్నూలులోని ప్రైవేటు ఆస్పత్రిలో ఎమ్మెల్యే విజయుడు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఎమ్మెల్యేతో పాటు పీఏసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎం, సీసీపై చర్య తీసుకోవాలి



గద్వాల: అలంపూర్ మండల మహిళా సమాఖ్య ఏపీఎం, సీసీలు మార్తమ్మ, జయమ్మపై చర్య తీసు కోవాలని సీఐటీయూ నాయకులు గురువారం అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావుకు ఫిర్యాదు ఇచ్చారు. వ్యక్తిగత ప్రయోజనాలు డిమాండ్ చేస్తూ కింది స్థాయి సిబ్బందిని వేధిస్తున్నట్లు తెలిపారు. విచారణ జరిపి శాఖాపరమైన చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య సభ్యులు ప్రభావతి, శాలమ్మ, సుధాకర్, లక్ష్మి, రాధ, భూలక్ష్మి, గంగన్న, లావణ్య, సీతమ్మ, గురు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చుదాం



మాట్లాడుతున్న కమ్యూనిటీ ఎడ్యుకేటర్ కృష్ణయ్య

అయిజ: గద్వాలను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చుదామని మిషన్ పరివర్తన్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ కృష్ణయ్య అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన్ కార్యక్రమాన్ని గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే చెడు ఫలితాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల రవాణ, వినియోగం నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. మత్తు పదార్థాలను విక్రయించినా, కొనుగోలు చేసినా 100, 14446, 1908కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థు లకు కాంపిటీటివ్ ఎగ్జామ్స్, ఎస్సే రైటింగ్, డ్రా యింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగరాజు, జాంగిర్, కృష్ణవర్ధన్, శ్రీరామ్, ఇస్మాయి ల్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిక్షణ శిబిరం



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఇంటర్మీడియేట్ విద్యాధికారి హృదయరాజు

గద్వాల: మండలంలోని గుంటిపల్లి, కొత్తపల్లిలో ఏడు రోజుల పాటు నిర్వహించిన గద్వాల ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 శీతాకాల శిబిరాలు గురువారం ముగిసాయి. గుంటిపల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి ఇంటర్మీడియట్ విద్యాధికారి హృదయరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విద్య ప్రాధాన్యత, బాల్య వివాహాల నిర్మూలన, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరిచినట్లు తెలిపారు. అదే విధంగా గ్రామాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు నిర్వహించారని, విద్యార్థి దశలో ఇలాంటి లక్షణాలు అలవర్చుకుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు అధిరోహించటానికి దోహదం చేయడమే కాకుండా సమాజ హితానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరన్న, ఏజీఎంసీ దేవేందర్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారులు పవన్‌కుమార్, వీరేశం, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

బాలికల భద్రతే సఖి ప్రధాన లక్ష్యం



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సఖి నిర్వాహకురాలు అరుణ

మల్దకల్: బాలికలకు అన్ని విధాల భద్రత కల్పించడమే సఖి ప్రధాన లక్ష్యమని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్, సఖీ నిర్వాహకురాలు శోభ అన్నారు. గురువారం బిజ్వారం హైస్కూల్‌లో సఖీ వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకురాలు అరుణ విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాత్కాలిక ఆశ్రయం, వైద్య సహాయం, మానసిక, సామాజిక కౌన్సిలింగ్, న్యాయసలహా, పోలీసు సేవల గురించి వివరించారు. గృహహింస, వరకట్న వేధింపులు, ఆడపిల్లల అక్రమ రవాణా, అమ్మకం, లైంగిక వేధింపులు వంటివి చట్టరీత్యా నేరమన్నారు. పని ప్రదేశం వద్ద మహిళలకు, పాఠశాలలో బాలికలకు ఎలాంటి ఆపద వచ్చిన వెంటనే 1098ను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సఖీ కేస్ వర్కర్ విమల, హెచ్ఎం మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రీడలు

ధరూరు: ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి క్రీడలను శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు ఎంఈఓ రవీంద్రబాబు, జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎస్‌జీఎఫ్ అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు వాలీబాల్ పోటీలు ఉంటాయన్నారు. జిల్లాలోని 13 మండలాలకు చెందిన దాదాపు 700 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనున్నట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు.

‘రిజర్వేషన్ పేరిట డైవర్షన్ రాజకీయాలు’

గద్వాల: బీసీ రిజర్వేషన్ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో డీకే బంగ్లాలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పేరిట స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తూ సీఎం ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శలు గుప్పించారు. ఎన్ని జిమ్మిక్కులు చేసిన స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బండల వెంకట్రాములు, రాంచంద్రారెడ్డి, శివారెడ్డి, జయశ్రీ, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై చైతన్యం పెరగాలి

మానవపాడు: సామాజిక అంశాలపై ప్రజల్లో మరింత చైతన్యం పెరగాలని సీఐ టాటాబాబు సూచించారు. గురువారం మండల పరిధిలోని మద్దూరులో కళాజాత బృందం ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్, సైబర్ నేరాలు, షీటీం, రోడ్డు భద్రత, డ్రగ్స్ వాడకం, పోక్సో చట్టం, సీసీ కెమెరాలు, డయల్ 100 గురించి వివరించారు. కార్యక్రమంలో శాంతినగర్ ఎస్ఐ నాగేశఖర్‌రెడ్డి, కళాజాతా బృందం ఎస్ఐ కేశవరావు, రాధమ్మ, రామాంజనేయులు, షీటీం కానిస్టేబుల్ దివ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ టాటాబాబు

కారు బోల్తా.. ఐదుగురికి గాయాలు

మానవపాడు: జాతీయ రహదారిపై కారు బోల్తా పడిన ఘటనలో ఐదుగురు గాయాల పాలయ్యారు. స్థానికులు, 108 సిబ్బంది కథనం ప్రకారం.. జాతీయ రహదారి- 44పై గురువారం తెల్లవారు జామున హైదరాబాద్ నుంచి కర్నూలు వైపుగా వెళ్తున్న కారు మానవపాడు శివారు ప్రాంతంలో బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురు స్వల్పంగా గాయపడినట్లు తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభు త్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఏఓగా బాధ్యతల స్వీకరణ

ఎర్రవల్లి: మండల వ్యవసాయ అధికారిగా గురువారం సురేష్‌గౌడ్ బాధ్యతలు చేపట్టారు. నాగ ర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలో వ్యవసాయ విస్తరణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

కేటీదొడ్డి: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదరబాదరగా చెల్లని జీఓ తెచ్చి తామేదో బీసీ సామాజిక వర్గాన్ని ఉద్ధరిస్తున్నట్లు షో చేసి చట్టం ముందు బోర్లా పడిందన్నారు. రిజర్వేషన్ల పేరుతో బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే బీజేపీ చూస్తు ఊరుకోదని పేర్కొన్నారు.

రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఎర్రవల్లి: రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పని చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు గంగాధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ వ్యవస్థాపకుడు మాన్యశ్రీ కాన్షీరాం వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలను చైతన్యవంతం చేసి రాజ్యాధికారం దిశగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఎవరి జనాభా ఎంతో వారి వాటా అంతా అనే నినాదంతో పార్టీ పనిచేస్తుందన్నారు. గ్రామ గ్రామాన కమిటీలు వేసి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మణికుమార్, రాజు, యేసురాజు, వెంకట్, నరేష్‌కుమార్, రాముడు, శాంతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పరిశీలన



అలంపూర్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన సామగ్రి, నామినేషన్ పత్రాలను ఎంపీడీఓ పద్మావతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నామినేషన్ల దా ఖలుకు మూడు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో ఆరు ఎంపీటీసీ స్థానా లకుగాను మూడు ఎంపీటీసీ స్థానాలకు క్యా తూర్‌లో, మరో మూడు స్థానాలకు పట్టణంలోని ఎమ్మార్సీ భవనం వద్ద ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు

శాంతినగర్: ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయిస్తే కేసు నమోదు చేస్తామని ఎక్సైజ్ ఎస్ఐ లక్ష్మీనారాయణ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధి శాంతినగర్‌లో వైన్స్‌లను ఎక్సైజ్ అధికారులు గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. రెండు మద్యం దుకాణాల్లోని రిజిస్టర్లు, మద్యం నిల్వలను పరిశీలించారు. కల్తీ మద్యం విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

న్యాయవాదిని అరెస్టు చేయాలి

గట్టు: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించిన న్యాయవాదిని తక్షణమే అరెస్టు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్‌రాజ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చే శారు. సీజేపై దాడి భారత రాజ్యాంగం, ప్ర జాస్వామ్యంపై జరిగిన దాడిగా పేర్కొన్నారు.

అలంకారప్రాయంగా సెగ్రిగేషన్ షెడ్లు



నీలిపల్లి సమీపంలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు

- కంపోస్టు ఎరువుల తయారి ఊసేలేదు
- పంచాయతీ సిబ్బందికి శిక్షణ కరువు
- పట్టించుకోని అధికారులు

మల్దకల్: గ్రామాల్లో ఇంటింటా సేకరించిన చెత్త నుంచి సేంద్రీయ ఎరువులను తయారు చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. చెత్త ద్వారా తయారు చేసిన ఎరువులను రైతులకు విక్రయించి గ్రామ పంచాయతీల ఆదాయం పెంచాలని, దీనికి తోడు గ్రామాల్లో పారిశుద్ధ్యంతో పాటు స్వచ్ఛతను మెరుగుపరిచే అవకాశం ఉంటుందని భావించిన ప్రభుత్వం ఆచరణలో మాత్రం సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణలో ముందడుగు పడటం లేదు.

ఎరువుల తయారీ శూన్యం

గద్వాల నియోజకవర్గంలోని 5 మండలాల్లో 131 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామ పంచాయతీకి ఒక సెగ్రిగేషన్ షెడ్డు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామ పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లలో కంపోస్టు ఎరువు మాత్రం తయారు చేయడం లేదు. దీనికి తోడు సేకరించిన చెత్తను ఖాళీ స్థలాలు, డంపింగ్ యార్డుల్లో పడేస్తూ తగులబెడుతున్నారే తప్పా సేంద్రీయ ఎరువుల తయారీకి వినియోగించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డులు దుర్గంధం వెదజల్లడంతో అవస్థలు పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.



అమరవాయిలో నిరుపయోగంగా ఉన్న షెడ్డు

షెడ్డు నిర్మాణానికి రూ.2.50 లక్షలు

గ్రామ పంచాయతీలో ఒక సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా రూ.2.50 లక్షలు ఖర్చు చేసింది. అయితే డంపింగ్ యార్డుల నుంచి వేరుచేసిన తడి, పొడి చెత్తలను వేర్వేరుగా పోగుచేసి సేంద్రీయ ఎరువులు తయారుచేసే విధానంపై పంచాయతీ, పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి శిక్షణ ఇవ్వలేదు. పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన లేకపోవడంతో చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి అక్కడ తగలబెడుతున్నారు. దీంతో ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు ఊరికి చివరన చెరువు కట్టల వెంట నిర్మించడంతో అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. రాత్రి వేళల్లో ఆకతాయిలకు, మద్యం ప్రియులకు అడ్డాలుగా మారాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తేవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



మండలంలోని వివిధ గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తేవాలి. గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– రాముడు, నాగర్‌దొడ్డి

కార్మికులకు శిక్షణ ఇవ్వాలి



కంపోస్టు ఎరువుల తయారీపై పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ ఇవ్వాలి. అవగాహన లోపంతో వాటిని పంచాయతీ సిబ్బంది సక్రమంగా వినియోగించడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది.

– గోవిందు, బిజ్వారం

చర్యలు తీసుకుంటాం



వివిధ గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ఎరువుల తయారీ పై గ్రామ పంచాయతీ సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి షెడ్లను వినియోగంలోకి తీసుకొస్తాం. – ఆంజనేయరెడ్డి, ఎంపీడీఓ, మల్దకల్